www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 18 | ఆగస్టు | 2025
పేజీలు : 7

## ఆశ్రమ విద్యార్థినులకు మళ్లీ అస్వస్థత

-ఆసుపత్రి పాలైన 15 మంది విద్యార్థినులు
-ఉడికి ఉడకని ఆహారమే కారణం



2 లో

## రసాయనిక ఎరువులపై అదనపు బాదుడు..!



-రైతులను దోపిడీ చేస్తున్న ఎరువుల వ్యాపారులు
-చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పిల్లి కళ్లు మూసుకుంటే ఎలుక ఎక్కిరించిందన్న చందంగా తయారైంది రసాయనిక ఎరువుల అమ్మకాల పరిస్థితి. వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడం చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో ఎరువుల దుకాణ యజమానులు రైతులపై అదనపు భారాన్ని మోపుతున్నారు. రశీదు రాసే మొత్తానికి తీసుకునే దానికి సంబంధం లేకుండాపోయింది. అయినా అధికారులు ఎందుకో ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. రసాయనిక ఎరువుల కొరత ఏర్పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి. కొన్ని సందర్భాల్లో వ్యాపారులే కృత్రిమ కొరతను సృష్టించి అందిన మేర దండుకుంటున్నారు. అసలే వ్యవసాయం

మిగతా 2లో..

## ఇండ్ల మధ్య రైస్‌మిల్..!



- ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కాలుష్యం
- దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్న నివాసాలు
- నిబంధనలకు తిలోదకాలిచ్చిన నిర్వాహకుడు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓ రైస్ మిల్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఇండ్ల మధ్యలోనే రైస్‌మిల్ ఉండటంతో అందులో నుంచి వచ్చే ధాన్యం పొట్టు, దుమ్ము ధూళి, శబ్ద కాలుష్యం వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రైస్ మిల్లులో యంత్రాల శబ్దాలతో ప్రజలు నిద్రలేమితో పాటు ఒత్తిడితో బాధపడుతున్నారు. అందులో నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు పరిశర ప్రాంతాల్లో పేరుకుపోయి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. అలాగే వ్యర్థ పదార్థాలు భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జలాలను కలిషితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు అనారోగ్య సమస్యల భారిన పడుతున్నారు.

**సమస్యలతో సతమతం...**

రైస్‌మిల్ నుంచి వచ్చే వ్యర్థాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు శ్వాసకోస సమస్యలతో సతమతవుతున్నారు. రైస్‌మిల్ నడిచేటప్పుడు అక్కడ ఓ అరగంట నిలబడితే చాలు శరీరంపై సన్నని దుమ్ము, ధూళి పేరుకుపోతుంది. ఇలా ఇండ్లు, చెట్లు, నీళ్లు అనే కాదు

మిగతా 2లో..

## అలు పెరగని పోరాట యోధుడు అయోధ్య





- నిజమైన కమ్యూనిస్టుని కోల్పోయాం
- సంస్మరణ సభలో కూనంనేని
- అయోధ్య సేవలను కొనియాడిన పలువురు
- ప్రజానేతకు వేలాది మంది ఘన నివాళి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/మణుగూరు :** ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు బొల్లోజు అయోధ్య అని, నిజమైన కమ్యూనిస్టుని కోల్పోయామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో ఆదివారం అయోధ్య సంస్మరణ సభ అశ్రునయాల నడుమ జరిగింది. ఈ సందర్భంగా ఆయోధ్య చిత్రపటానికి కూనంనేని తో పాటు మహబూబాబాద్ ఎంపి పోరిక బలరామ్ నాయక్, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు ఎండి మౌలాన, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నివాళ్లర్పించారు. సభా ప్రాంగణం వద్ద అయోధ్య చిత్రపటాన్ని చూసి పలువురు కంటతడి పెట్టారు. పినపాక నియోజకవర్గ రాజకీయాలను కంటిచూపుతో శాశించే

మిగతా 2లో..



# రసాయనిక ఎరువులపై అదనపు బాదుడు..!

**(మొదటిపేజీ తరువాయి)**
కలిసిరాక రైతుల ఆర్థిక పరిస్థితి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న సామెతలా తయారైంది. ఇది చాలదన్నట్లు ఇప్పుడు ఎరువుల వ్యాపారులు రైతులను దెబ్బతీస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో యూరియా కొరత సృష్టించారు. యూరియా బస్తా రూ. 270 ఉండగా రూ. 370 విక్రయిస్తున్నారు. రూ. 370లు తీసుకుని రశీదు మాత్రం రూ. 270లకే ఇస్తున్నారు. 2020 కాంప్లెక్స్ ఎరువు కూడా రూ. 1150 ఉండగా రూ. 1250 లకు విక్రయిస్తున్నారు. సొసైటీల ద్వారా యూరియా సరఫరా చేస్తున్న అంతగా నాణ్యతగా లేదని సన్న రకం యూరియా వస్తుందని రైతులు సొసైటీల్లో కొనుగోలు చేసేందుకు రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఒక ముదిగొండ మండలంలోనే 35 ఎరువుల దుకాణాలు ఉండగా ఇవి కాకుండా అనాధికారికంగా గ్రామాల్లో ఎరువులను విక్రయిస్తున్నారు. ఎరువుల దుకాణాల నుంచి బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలి పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తున్నా వ్యవసాయ శాఖాధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా రసాయనిక ఎరువులపై అదనపు వసూళ్ల బారి నుంచి రైతులను రక్షించాలని సకాలంలో ఎరవులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్న ఎరువుల దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుని లైసెన్స్‌లు రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు మండల వ్యవసాయాధికారులు వ్యాపారులతో చేతులు కలుపుతున్నారని అందుకే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇండ్ల మధ్య రైస్‌మిల్..!

**(మొదటిపేజీ తరువాయి)**
అన్ని చోట్ల మంచు దుప్పటిలా దాని పరిధిలోని నివాసలను కప్పేస్తుంది. తెల్లవారుజామున మహిళలు ఇల్లు, వాకిలి ఊడిస్తే కుప్పలు, కుప్పలుగా ధూళి దర్శనమిస్తుంది. వర్షాలు కురుస్తుండటంతో రైస్ మిల్లు అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. అందులో నుంచి వరద చుట్టు పక్కల నివాసాల్లోకి వస్తుండటంతో పరిస్థితి దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. అంతేకాకుండా ఈగలు ఆ వ్యర్థపు నీటిపై వాలి, ఇండ్లల్లోని ఆహారంపై వాలి రోగలకు కేంద్రబిందువుగా మారాయి. ఇప్పటికైన అధికారులు రైస్ మిల్ మూసేయలని ప్రజలు కోరుతున్నారు.



### నిబంధనలకు తిలోదకాలు..

సదరు రైస్ మిల్ నిర్వాహకుడు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఏండ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నప్పటికీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. రైస్ మిల్లులో నుంచి ధాన్యం పొట్టు రాకుండా..గాలిలో చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సినప్పటికీ పట్టించుకోవడం లేదు. పర్యావరణ కాలుష్యం జరగకుండా చెట్లను పెంచాలి కానీ అటువంటి పరిస్థితి అక్కడ కనిపించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ధనార్జనే ధ్యేయంగా ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు. ఈ మిల్లు సమస్యపై ప్రజలు కలెక్టర్‌కు సైతం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ తీరుపై ఏదులాపురంమున్సిపాలిటీ అధికారుల పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. అడ్డగోలు వ్యవహారంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై తహాశీల్దార్ పిల్లి రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా..పరిశీలన చేస్తామన్నారు. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెలతామన్నారు.

# ఆశ్రమ విద్యార్థినులకు మళ్లీ అస్వస్థత



**ప్రజాపక్షం/ కల్లూరు :** ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రజాప్రతినిధుల సూచనలు ఇక్కడ బేఖాతర్. విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన ఆశ్రమ పాఠశాల సిబ్బంది సరైన రీతిలో వ్యవహరించక పోవడంతో కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం పెద్ద సంఖ్యలో విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా ఉన్నతాధికారులు ఆశ్రమ పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు. అయినా శనివారం సాయంత్రం ఉడికి ఉడకని ఆహారం తినడంతో విద్యార్థినులకు ఆదివారం ఉదయం నుంచి వాంతులు, విరోచనలు అయ్యాయి. దాదాపు 15 మంది విద్యార్థులు అనారోగ్యం బారీనపడడంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు స్థానిక ఆసుపత్రికి తరలించారు. బియ్యంలో తెల్ల పురుగులు, ముక్క పురుగులు వస్తున్నాయని, ఉడికి ఉడకని ఆహారం, కూరలు పెడుతున్నారని దీని వల్ల అనారోగ్యం పాలవుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ముందే వడ్డించే ఆహారం పరిశుభ్రత, తదితర విషయాలపై విద్యార్థులు పలు ఆరోపణలు చేయడం గమనార్హం. జిల్లా గిరిజన సంక్షేమాధికారి విజయలక్ష్మి, సహాయ అధికారి భారతి, తహసీల్దార్ పులి సాంబశివుడు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న విషయాలను తల్లిదండ్రులకు కానీ ఇతరులకు కానీ చెప్పవద్దని పిల్లలను బెదిరిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలు కావడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు వంట మనిషిని వెంటనే మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎటువంటి పొరపాట్లు లేకుండా మెనూ అమలయ్యేలా చూస్తామని తెలిపారు. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపి తగు చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

# అలు పెరగని పోరాట యోధుడు అయోధ్య







**(మొదటిపేజీ తరువాయి)**
నిలువెత్తు శిఖరం, దిక్కార స్వరం ఇక కనబడుదు, వినబడుదూ అంటూ పలువురు చర్చించుకున్నారు. సంస్మరణ సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్లు కుండబద్దు కొట్టేలా మాట్లాడే వ్యక్తిత్వం గల మనిషి అయోధ్య లేకపోవడం చాలా విచారకరం. సూర్యపేట ప్రాంతం నుండి ఇక్కడికి సామాన్య వ్యక్తిగా వచ్చిన ఆయన అసమాన నాయకునిగా గుర్తింపు పొందారన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఏ నాడు తన గురించి ఆలోచించుకోకుండా పేదలకు, బడుగు బలహీన వర్గాలకు, నిర్భాగ్యులకు ఎర్ర జెండా తరుపున ఏదైనా చేయాలని తపనతోనే ఆఖరిదాగా జీవించారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం భుజాన ఎత్తుకున్న ఎర్రజెండాను కిందపడనీయకుండా, ఆ జెండా రెపరెపలు ఎక్కడా వాడిపోనికుండా చేశారని, ఆఖరికి అదే ఎర్రజెండా కప్పుకుని మాయమై పోయారని కంటతడి పెట్టారు. సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా పోరాడే నైజం ఉన్న ఆయన అవసరాన్ని బట్టి ఎక్కడ తగ్గాలో, నెగ్గాలో కూడా తెలిసిన వ్యక్తి అన్నారు. శాస్త్రీయ దృక్పదం గల మేధావిగా, సమాజా శ్రేయస్సు పట్ల ప్రేమ, తృష్ణ ఉన్న నేత అని, కనీస సౌకర్యాలు లేని రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు ఆయన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిలబడ్డారని, నిర్భందాలు, ధౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలను సైతం ఎదుర్కొన్నారని చెప్పారు. మైసా కొండయ్య, పాకాలపాటి పెద్దబ్బాయి, దాట్ల వెంకటేశ్వరబాబు వంటి నాయకులతో కలిసి బలమైన పోరాటాలు చేశారని, దమీందారీ వ్యవస్థకు ఎదురొడ్డి నిలబడి భూమిలేని పేదలకు భూములు పంచారని, నిరుపేదలకు అండగా ఉన్నారని, పోడుభూములకు పట్టాలు ఇప్పించే విషయంలోనూ, బిటిపిఎస్ నిర్వాసితులకు హేతుబద్ధమైన ప్యాకీజి ఇప్పించి నిర్వాసిత కుటుంబాల్లోని యువతకు ఉద్యోగాల కల్పనలో ఆయన చేసిన కృషి చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. సిపిఐ తరుపున అనేక గ్రామాల నిర్మాణంలో అయోధ్య కీలక భూమిక పోషించారని, పార్టీ నిర్మాణంతో పాటు ప్రజా సంఘాల నిర్మాణాన్ని భుజాన ఎత్తుకుని కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించిన మేధావి అన్నారు. పూర్వపు బూర్గంపాడు నియోజకవర్గం మొదలుకుని నేటి పినపాక నియోజకవర్గం వరకు ఎంఎల్‌ఏలను గెలిపించడంతో ఆయన చేసిన కృషి మరువలేనిదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా విలక్షణ రాజకీయాలు చేశారని చెప్పారు. జూలై నెల్లో అశ్వారావుపేట కేంద్రంగా జరిగిన జిల్లా 3న మహాసభల్లో ఆయన భావోద్వేగానికి లోనై ఆఖరి ప్రసంగం చేస్తూ యువత రాజకీయాల్లోకి రావాలని, పేదలు,కార్మికులు, కర్షకులకు అండగా నిలబడి ఎర్రజెండాను మరింత సగర్వంగా ఎగురనివ్వాలని సూచించారన్నారు. ఈ ప్రాంత కమ్యూనిస్టు శిఖరంగా పార్టీని ముందుడి నడిపిన అయోధ్య భౌతికంగా మన మధ్య లేడంటే ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నామని, ఆయన వదిలి వెళ్లిన ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేసిన నాడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని ఈ సందర్భంగా కూనంనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సిపిఐ నాయకులు కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, ముివ్వా వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మి కుమారి, ఉప్పు శెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, అనంతనేని సురేష్‌తో పాటు మండే వీరహనుమంతరావు, టిడిపి నాయకులు వాసి రెడ్డి చలపతిరావు, వట్టం నారాణ, సిపిఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోసీ నాయకులు కేతా నాగేశ్వరరావు, మాస్‌లైన్ జిల్లా నాయకులు ఆర్ మధు సూధన రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కొల్లెటి భవాని శంకర్, పోశం భాస్కర్, జక్కుల రాంబాబు, సుధాకర్, రామ్‌గోపాల్, రమేష్, టిఎన్‌టియూసి నాయకులు పోటు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో సిపిఐ నేత రవీందర్ మృతి




**- నివాళులర్పించిన దండి, మౌలానా, వివిధ పార్టీల నాయకులు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఎంవీ,పాలెం గ్రామానికి చెందిన సిపిఐ మండల సమితి సభ్యుడు కొత్తకొండ రవీందర్(45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నివాళులర్పించినవారిలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి, బికేయంయు జిల్లా ప్రధానకార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్, జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, లింగా వెంకటనారాయణ, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయ కార్యదర్శి బానోత్ రామ్మూర్తి, మండల సమితి సభ్యులు పాసంగుల చందర్రావు, ఏలూరి భాస్కర్, వెన్నం భాస్కర్, పగీళ్ల వీరభద్రం, ఆరెంపుల సైదులు, ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్, సిపిఎం జిల్లా నాయకుడు నంద్ర ప్రసాద్, ఎమ్మెల్ పార్టీ నాయకులు దొండేటి సత్యం, మందడపు వెంకటరమణ, బిఆర్ఎస్ నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, బానోత్ ఎల్లయ్య పాల్గొన్నారు.

# కామ్రేడ్ బొల్లోజు అయోధ్య సెంటర్‌గా నామకరణం





**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ రాష్ట్ర సిపిఐ పార్టీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య చారి ఇటీవలే అకాల మరణం చెందగా వారి జ్ఞాప కార్థం వారి అభిమాని మాదాడి రాజేష్ మణుగూరు వేణు రెస్టారెంట్ సెంటర్‌ను అయోధ్య సెంటర్ గా నామకరణం చేశారు. ఈ అయోధ్య సెంటర్ బస్టాప్ ను మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నే రవి ప్రారంభించారు. అనంతరం రవి మాట్లా డుతూ కమ్యూనిస్టు పార్టీకి ప్రజలకు ఎనలేని సేవలు చేసిన అయోధ్య పేరు మీద అయోధ్య సెంటర్ బస్టాప్ ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అయోధ్య ఆత్మ శాంతికి నివాళిగా మణుగూరు పట్టణ ప్రజలందరూ ఇకపై అయోధ్య సెంటర్ గా పిలవాలని కోరారు.

# పెసర రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి**




**ప్రజాపక్షం/కొణిజర్లః** కొణిజర్ల మండలంలో ఆదివారం వైరా మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పెసర పంట పొలాలను బానోతు చంద్రావతి పరిశీలించారు. పంట చేతికొచ్చే సమ యంలో కురిసిన వర్షాలకు పెసర రైతులకు భారీగా నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునేందుకు నష్టపరిహారం అందించా లని ఆమె అన్నారు. అదేవిధంగా రైతులకు పంటల భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల భీమా అమలు చేస్తే పంటలు నష్ట పోయినప్పుడు రైతులకు న్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. ఎంతోమంది రైతులు పెసర సాగు చేశారని, చేతికి పంట వచ్చే సమ యంలో కురిసిన వర్షాలకు పెసరకాయ కుళ్లిపోయి బూజు పట్టడం జరి గిందని, దీంతో పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు పెసర పంటలను చూసి కన్నీటి పర్యవంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం తక్షణమే గ్రామాల్లో కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట నష్టా న్ని అంచనా వేసి రైతులకు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలబడాలి




**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరన్నర కాలంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిం దని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ కోరారు. ఆదివారం దెందుకూరు గ్రామంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రేష న్‌కార్డులను, గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణీ నిరంతరాయంగా జరుగు తుందని, అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వూట్ల రాంబాబు, సీనియరర్ నాయకులు ఐతం ప్రసాద్, యడ్లపల్లి సంగయ్య, వీరయ్య, కపిలవాయి కృష్ణ, పమిడి కృష్ణ, పగిడిపల్లి సంజీవరావు, చల్లా రామారావు, బాజా నర్సింహారావు, బిట్టు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కడప పండుగ వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని బంజారాకాలనీలో బంజారాల ప్రత్యేక సంప్రదాయ పండుగైన కడువ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. పండుగ సందర్భంగా గ్రామదేవత లకు ప్రత్యేక పూజలు చేసి కోళ్లతో బలి ఇచ్చి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరో గ్యంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. స్త్రీలు సంప్రదాయ బంజారా వేషధారణలో పాల్గొని నృత్యాలు, పాటలతో పండుగ ఉత్సాహంగా సాగింది.తండా నాయకులు మాట్లాడుతూ కడవ పండుగ బంజారాల ఆచార, విశ్వాసాల ప్రతీక అని, ఈతరహా సంప్రదాయ పండుగలు యువతకు పరిచయం చేస్తూ వారసత్వాన్ని కొనసాగిం చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు, కర్బారీలు, పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోండి




**-రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెచ్చల రంగారెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో అతివృష్టి. అనావృష్టి పరిస్థితుల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెచ్చల రంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకు నేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రైతు సంఘం జనరల్ బాడీ సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ అన నుకూల వాతావరణ పరిస్థితులు ఈ ఏడాది రైతాంగాన్ని దెబ్బతీశాయ న్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడి పంటల ఎదుగుదల అంతగా లేదన్నారు. వాగులు, ఏర్లు, నది పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. పత్తి, ఇతర మెట్ట పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయని వీటన్నింటిని అంచనా వేసి తగు విధంగా పరిహారం అందించే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, నాగేశ్వర రావు, నాయకులు బందెల వెంకయ్య, శివలింగం, లలిత, లాల్‌మియా, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన నల్లమల శేఖర్ అనే రైతు ఎద్దు అతి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న వైర్లు తగిలి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు : మేయర్

**-58వ డివిజన్‌లో ఇండ్ల పట్టాల పంపిణీ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఆదివారం 58వ డివిజన్ బిసి కాలనీ, దొరన్న కాలనీ, రమ ణగుట్ట తదితర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మేయర్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని ఆమె తెలిపారు. ప్రజలు దీనిని సద్విని యోగం చేసుకోవాలని ఆమె కోరారు. పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరాముక్తార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై. హన్మం తరావు, నాగండ్ల దీపక్ చౌదరి, శెట్టి రంగారావు, తోటకూరి శివయ్య, శోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, బేబి తదితరులు పాల్గొన్నారు.

# వైరా రింగు రోడ్డు సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/వైరాః** వైరా రింగు రోడ్డు సెంటర్ వద్ద గుంతలు లేకుండా మరమ్మత్తులు చేపట్టి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. వైరా రింగు రోడ్డు సెంటర్ నుండి రాజమండ్రి వైజాగ్ అలాగే కొత్తగూడెం భద్రాచలం చత్తీస్‌ఘడ్‌తో పాటు విజయవాడ, జగ్గయ్యపేట, నాగార్జునసాగర్, బెంగుళూరు వెళ్లుటకు అనేక రకాల వాహనాలు పేరా నుండి పోతూ ఉంటాయి. టూవీలర్స్‌పై పోయే వాహనదారులకు కాలినడకన రోడ్డు దాటుతున్న ప్రయణీకులకు ప్రజలకు అనేక రూపంలో యాక్సిడెంట్లు జరిగి కుటుంబ పెద్దలను తల్లిదండ్రులను కోల్పోయి కొంతమంది వికలాంగులుగా ఏర్పడాల్సి వస్తున్న పరిస్థితి వైరా రింగు రోడ్డు సెంటర్‌లో చూస్తున్నాం. రింగు రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తూ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ని ప్రభుత్వం వారు నియమించినచో ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చును. అధికారులు స్పందించి రింగు రోడ్డును గుంతలు లేకుండా మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు.

# అయోధ్య సంస్మరణ సభ దృశ్యమాలిక






















# నిరాడంబర యోధునికి వినమ్ర నివాళి

- కంటతడి పెట్టిన కూనంనేని, పాయం
- పొత్తు ధర్మం తప్పని నిబద్ధత గల నాయకుడు : ఎంపి పోరిక బలరామ్ నాయక్
- రాజకీయ బిక్షం పెట్టింది అయోధ్యనే : పాయం
- పేదలు నచ్చిన, మెచ్చిన మనిషి : బాగం
- ఆయనో ఉధ్యమస్ఫూర్తి : సాబీర్ పాషా






**ప్రజాపక్షం/మణుగూరు :** నిరాడంబర కమ్యూనిస్టు యోధుడు, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యకు పలువురు వినమ్రత ఘన నివాళి అర్పించారు. స్థానిక కిన్నెర కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సంస్మరణ సభకు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది తరలి వచ్చారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం అయోధ్య అమర్ రహే, నీ ఆశయాలను సాధిస్తాంటూ అంటూ పిడికిలి బిగించి పెద్దపెట్టున చేసిన నినాదాలు మార్మోగాయి. అయోధ్య సంస్మరణ సభను పురస్కరించి మణుగూరు ప్రాంతం చిన్నబోయింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, అయోధ్య రాజకీయ శిష్యుడు, పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అయోధ్యతో ఉన్న అనుబంధాన్ని తలుచుకుంటూ కంటతడి పెట్టారు. దీంతో సభకు హాజరైన వారు ఒక్కసారిగా కళ్లను తుడుచుకుంటూ కనిపించారు. అయోధ్యలేని మణుగూరును గుర్తు చేసుకుంటుంటే బాధగా ఉం దని, ఆ ఆవేదన ఇప్పట్లో తీరేదికాదని చెమర్చిన కళ్లతో తడబడుతున్న స్వరంతో అనుకున్నారు. ఈ సందర్భంగా సంస్మరణ సభను ఉద్దేశించి పలువురు మాట్లాడారు.

### పొత్తు ధర్మ తప్పని నిబద్ధత గల నాయకుడు : ఎంపి బలరామ్ నాయక్

పినపాక నియోజకవర్గ సిపిఐ నేత బొల్లోజు అయోధ్య పొత్తు ధర్మ తప్పని నిబంద్ధత గల నేతని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరామ్ నాయక్ అన్నారు. ఆయోధ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ దేశరాజకీయ అవసరాల దృష్ట్యా రెండు జాతీయ పార్టీలు కలిసి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పనిచేసే నేతని చెప్పారు. రాష్ట్రంలో సిపిఐ తో కాంగ్రెస్ పార్టీ పొత్తుపెట్టుకున్న ప్రతి సందర్భంలోనూ నిస్వార్ధంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆయన లేని లోటు కమ్యూనిస్టు పార్టీకి తీరనిదని, ఆయన చూపిన మార్గంలో ముందు తరం ముందుకు సాగాలని సూచించారు.

### నాకు రాజకీయ భిక్ష పెట్టింది అయోధ్యే : ఎంఎల్ఏ పాయం

తాను సిపిఐలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని, తనను భారత కమ్యూనిస్టు (సిపిఐ) పార్టీలోనికి తీసుకొచ్చి రాజకీయ బిక్ష పెట్టింది బొల్లోజు అయోధ్యేనని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో కొనసాగడానికి కారణం అయోధ్య నేర్పిన రాజకీయ క్రమశిక్షణే అని, ఆయన పేరు తలంపుకుంటూ పలుమార్లు కంటతడి పెట్టారు. విద్యార్థి, యువజన ఉధ్యమాల్లో ఆయన నేర్పిన పోరాట పటిమ ఎన్నటికీ మరువలేనిదని, తనతో కలిసి మొదలైన రాజకీయ ప్రస్థానంలో సైకిల్, మోటారు సైకిళ్లపై, కాలినడకల మధ్య సాగిందని, సొంత జీవితాన్ని ప్రక్కన పెట్టిన ఆయన అనునిత్యం ప్రజల కోసమే ఆలోచన చేసేవారని, తనకు కొన్ని సందర్భాల్లో నేర్పిన రాజకీయ పాఠాలు ఈ స్థాయికి ఎదగడానికి దోహదపడ్డాయని అన్నారు. ఆయన లేరనేది జీర్ణించుకోలేని విషయమని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత భారతకమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలపై ఉందని అదే అయోధ్యకు ఇచ్చే ఘన నివాలి అని, ఈ ప్రాంతంలో సిపిఐకి, అయోధ్య కుటుంబానికి తాన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు.

### పేదలు నచ్చిన, మెచ్చిన మనిషి అయోధ్య : బాగం

పినపాక నియోజకవర్గంలో పేదలు, కార్మికులు, కర్షకులు మెచ్చిన, నచ్చిన మనిషి అయోధ్యని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకర్గంలో సిపిఐ అంటే అయోధ్య, అయోధ్య అంటే సిపిఐ గా కొనసాగిందని చెప్పారు. రాజకీయ ప్రత్యేక అంశాల్లో పార్టీ ఇచ్చిన పిలుపును ఏ నాడు దిక్కరించలేదని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తుపాకీ తూటాలను సైతం లెక్కచేయని ధీరుడని, అవసరాన్ని బట్టి అఖిలపక్ష నేతలను సైతం ఏకం చేసి ప్రజా సమస్యలను తీర్చేవారన్నారు. సిపిఐ నిర్మాణంలో క్రీయాశీలకంగా వ్యవహరించే ఆయన ఎక్కడా రాజీపడలేదని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల సంబురాలను కళ్లారా చూడకుండానే అయోధ్య అమరుడయ్యారని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడుతూ ఆయన కోరుతున్న రాజకీయ విలువలకు కట్టుబడుతూ రానున్న స్థానిక ఎన్నికలను అయోధ్యకు అంకితమిస్తూ గెలుపుబాటలో పయణిద్దామని పిలుపునిచ్చారు.

### ఆయనో ఉధ్యమస్ఫూర్తి : ఎస్‌కే సాబీర్ పాషా

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య ఓ ఉధ్యమ స్ఫూర్తి అని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం రాజీలేని దోరణిలో సాగిందని, అధికారులను నిలదీస్తూ, వారి ఆగడాలను ఎండగడుతూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని చెప్పారు. ఆయన చేసిన అసమాన పోరాటాలు,త్యాగాలు ముందు తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఒక సామాన్య మనిషిగా ఇక్కడికి చేరుకున్న అయోధ్య అశేష జనాధరణ పొందిన నేతగా, తిరుగులేని కమ్యూనిస్టు రాజకీయ శక్తిగా నిలిచారంటే అశామాషీ కాదని, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించి చిరంజీవిగా మిగిలారన్నారు. నిత్యం ప్రజాసేవ కోసమే పరితపించిన నిస్వార్థ పరుడని, తన సొంత జీవితాన్ని ప్రక్కనపెట్టి ప్రజా సేవకే అంకితమై, నమ్మిన జెండాను, సిద్ధాంతాన్ని కడదాకా అంటిపెట్టుకుని చిరస్మరణీయుడయ్యారని, ఆయన చూపిన మార్గాన పయణిస్తూ సిపిఐ బలోపేతానికి ముందుకు సాగుదాం అన్నారు. అనంతరం సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్,డిసిసిడి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఐఎన్‌టియూసి నాయకులు పోటు రంగారావు, సిపిఐ నాయకులు ముత్యాలవిశ్వనాథం, మున్నా లక్ష్మి కుమారి,టిడిపి, సిపిఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్, న్యూడెమోక్రసీ నాయకులతో పాటు పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, కమటం చంద్రకళ,ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, అనంతనేని సురేష్, జక్కుల రాంబాబు, సుధాకర్, రామ్‌గోపాల్, రమేష్, రత్నకుమారి, ఎస్‌విఎస్ నాయుడు, ఏపూరి వెంకటేశ్వరరావు, మీసాల భాస్కర్ రావు, తో పాటు మండే వీరహనుమంతరావు, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోసీ, మాస్‌లైన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక కుటుంబాల జీవితాలతో చెలగాటమాడుతున్న సింగరేణి



**ప్రజాపక్షం/ఇల్లందు:** శతాబ్దం క్రితం 21 ఏరియా ప్రాంతానికి భూ గర్భ గనిలో పనిచేయడానికి స్థానికులు భయపడుతున్న నేపథ్యంలో వరంగల్ , కరీంనగర్, బళ్లార్ష, నాగపూర్, ఉత్తరప్రదేశ్ , మధ్యప్రదేశ్ ప్రాంతాల నుండి దక్కన్ కంపెనీ భూ గర్భగనులలో పనిచేయడానికి అనేక కుటుంబాలను ఇల్లందు ప్రాంతానికి తెచ్చి 20, 21, 22, 23, 24 వాటంపిట్, స్ట్రట్ పిట్ భూగర్భ గనులలో పనిచేయడం కోసం ప్రత్యేక దృష్టి సారించి కుటుంబాలను తెచ్చే వారు. గని ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు పనులు మానేసి తమ స్వంత ప్రాంతాలకు వెళుతుంటే బ్రతిమాలి మళ్ళీ కొత్త కార్మికులను తెప్పించి దక్కన్ కంపెనీ భూ గర్భగనులలో పనులు చేపించే వారు. ఆ నేపద్యం లోనే గని ప్రాంతాలలో ఇళ్లు నిర్మించి, స్వంతంగా ఇళ్లు కట్టుకొనే వారికి గుట్ట గడ్డి,వాసాలు సింగరేణి సరఫరా చేస్తూ కార్మికులతో పనులు చేయించుకునేవారు. ఆ నాటి నుంచి నేటివరకు అనేక మంది కార్మికులు గని ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అలా ఏర్పడ్డ గడ్డ 21పిట్ ప్రాంతం ఈ ప్రాంతం లో నూతన ఓపెన్ కాస్ట్ తీస్తామని ఈ స్థలం తమదే నని నేడు సింగరేణి వేదాలు వల్లిస్తున్నది. సింగరేణి సంస్థ 100సంవత్సరాల లీజు 2014లో పూర్తయ్యాక ఈ భూమి రెవెన్యూది. అందులో ప్రజలు వంద ఏళ్ళుగా ఆవాసాలు నిర్మించుకొని జీవిస్తున్నారు. అందునా ఈ ప్రాంతం షెడ్యూల్ ప్రాంతం ఇక్కడ పీసా చట్టం ప్రకారం ఆదివాసీ తెగలకు ఉన్న 5వ షెడ్యూలు ప్రాంతం అయినా సింగరేణి ఈ స్థలం నాది అని లీజు భూమి అని ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీస్, రెవెన్యూ అధికారులు మా వెనుక ఉన్నారు. అనే మొండి వైఖరితో సింగరేణి ఒక ప్రైవేటు సంస్థ లాగా వ్యవహరించడాన్ని 21 పిట్ అఖిల పక్ష కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. నాడు 2023 పబ్లిక్ హియరింగ్ లో సింగరేణి ఒప్పుకున్న విధంగా ఇళ్లు కోల్పోతున్న 200మందికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, సింగరేణి క్వార్టర్ల లో నివసిస్తున్న వారికే క్వార్టర్లు స్వంతం చేయాలని, స్వంత ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని,వ్యవసాయదారులకు నష్టపరిహారం చెల్లించాలని,ప్రభావిత ప్రాంతాల నిరుద్యగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, సింగరేణి ఓసీ ప్రాంతం మినహా మిగిలిన నివాస ప్రాంతాలు సింగరేణి దత్తత తీసుకుని త్రాగు నీరు, విద్య, వైద్య సౌకర్యాలు క్రీడా మైదానాలు, కమ్యూనిటీ హాళ్ళు పరిశుద్యం, డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేసే వరకు ఇక్కడ ఓసి పనులు ప్రారంభించకుండా నిలుపుదల చేస్తామని, ప్రజా ఉద్యమం నిర్వహించాలని అఖిల పక్షం సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపీఐ, సీపిఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల నేతలు అబ్దుల్ నబి, సత్యనారాయణ, పూనెం సురేందర్, తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వెన్నంపల్లి శ్రీనివాస్, క్లింట్ రోచ్,చందవత్ రమేష్, లాలు సదరం మహేష్ గుళ్ళ మొగిలి, దనసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సిఏలో భారీ అవినీతి



**-అభివృద్ధి పనుల పేరుతో నిధుల దోపిడీ**
**-టిసిఏ కార్యదర్శి గురవారెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ)లో భారీ అవినీతి చోటు చేసుకుందని నిధుల వినియోగం అవినీతితో నిండి పోయిందని కాగ్ మార్గదర్శకాలకు విరుద్ధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహరించిందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఏ) ప్రధాన కార్యదర్శి గురవారెడ్డి ఆరోపించారు. ఖమ్మం లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత ఆడిటర్ల ద్వారా కూడా ఆమోదం పొందలేని పరిస్థితిలో హెచ్‌సిఏ ఉందన్నారు. అక్రమంగా ఆర్థిక ఖాతాలను ఆమోదించారని గతంలో ఉన్న కార్యదర్శులు, సరఫరాదారులు పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని 2023 అక్టోబర్‌లోనే నాలుగు కేసులు నమోదైనా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. హెచ్‌సిఏలో రూ. 200 కోట్లకు పైగా దోపిడీ జరిగిందని ఇందులో రూ. 12 కోట్లు జిల్లాల క్రికెట్ పేరిట దుర్వినియోగం చేశారని గుర్వారెడ్డి తెలిపారు. అవినీతిలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై స్థానిక పోలీసులు కేసులు నమోదు చేయాలని సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు తీసుకున్నప్పుడే కుట్రల నుండి యువ క్రికెటర్లు రక్షించబడతారని ఆయన తెలిపారు. 90 ఏళ్ల హెచ్‌సిఏ చరిత్రలో తెలంగాణలో ఎక్కడ క్రికెట్ కోసం మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. బిసిసిఐ నిబంధనలు పాటించని సంస్థలను కూడా అర్హులుగా చేర్చారని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో కూరపాటి ప్రదీప్‌కుమార్, వీరేష్ గౌడ్, జయపాల్, చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** వర్షాకాల నేపద్యంలో ఇటీవల వర్షాలు కురిసిన దరిమిలా ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డెంగ్యూ, మలేరియా, టైఫాయిండ్ లాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హర్షం పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఇంట్లో ఎవరికైనా జ్వరం తగ్గని పక్షంలో వెంటనే వారిని సమీపంలోని డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలని, ఒకరి నుండి ఒకరికి అంటువ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు గణనీయంగా పెరిగాయని, టిబి, ఎయిడ్స్ లాంటి రోగాలకు క్షేత్రస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో బిపి, షుగర్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి



**ప్రజాపక్షం/వైరా:** నిరంతరం వైద్యసేవతో వైరా బోడేపూడి వైద్యశిబిరం పేద, మధ్యతరగతి ప్రజలకు విశిష్ట వైద్యసేవలు అందిస్తూ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ప్రశంసలు అందుకుంటుంది. బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల క్రితం నుంచి క్రమం తప్పకుండా ప్రతి నెల మూడో ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గత 10 సంవత్సరాల క్రితం నుంచి షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. నెల రోజులకు సరిపడా మందులను కేవలం రూ.100లకే అందిస్తున్నారు. ఆదివారం 122వ నెల విజయవంతంగా వైద్యసేవలు అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, గుర్రం రమణారెడ్డి, బృందం ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వైద్య బృందం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, పరిశుభ్రమైన మంచినీరు త్రాగాలని సూచించారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె, కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని సలహా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, బోడేపూడి వైద్యశిబిరం బాధ్యులు సుంకర సుధాకర్, వాలంటీర్లు చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల రజిత, బొంతు సమత, గుడిమెట్ల మోహన్‌రావు, మోదుగు నాగరాణి, అనుమోలు రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

# తరలుతున్న వినాయక విగ్రహాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపం నుంచి వినాయక విగ్రహాలు ముందుగానే కొనుగోలు చేసుకుని తీసుకొని వెళ్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి గత కొద్ది సంవత్సరాలుగా ఇక్కడ ఉంటూ విగ్రహాలను తయారు చేసుకొని జీవనాధారంగా జీవిస్తూ విగ్రహాలను ఆధారంగా చేసుకొని ఆదాయం పొందుతున్నారు. ఒక్కో విగ్రహం సైజును బట్టి అడుగులను బట్టి రూ.15 వేల నుంచి 50 వేల వరకు ధర కు అమ్ముకుంటున్నారు. ఇదే సమయంలో ఎంత ధర అయినా కొనుగోలు చేసేందుకు భక్తులు సిద్ధంగా నగదును చేసుకొని కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. మరికొందరు అడ్వాన్సుగా ఇచ్చి రశీదును పొందుతున్నారు. ఇదే సమయంలో వారు విగ్రహాల ధరలను పెంచేశారు. ఈ విగ్రహాల కోసం తిరువూరు, తల్లాడ కల్లూరు, పెనుబల్లి, మండలాల నుంచి వచ్చి కొనుగోలు చేసుకుని తీసుకొని వెళ్తున్నారు. వారం రోజులు ఇంకను ఉన్నా ముందస్తుగా నగదును ఇచ్చి వెళ్తున్నారు.

# అసమానతలు లేని విద్యనందించడంలో వైఫల్యం

**-పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** 79 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ విద్యను అందించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారని పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీ తెలిపారు. ఆదివారం రామనర్స య్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గంలో పృథ్వీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నాయని చెబుతుండటం వట్టి బూటకమని ఇవి ప్రజలను మభ్యపెట్టే మాటలన్నారు. ప్రజా సంక్షేమం పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదని ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేసి విద్యార్థులందరికీ ఉచితంగా మెరుగైన విద్యను అందించాలని పృథ్వీ డిమాండ్ చేశారు. పరోక్షంగా పాలకులు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ లు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటిని విడుదల చేయాలని కోరుతూ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయి బోలా, నాయకులు బి. నర్సింహారావు, అఖిల్ కుమార్, నరేందర్, సాయి కుమార్, గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద విలువలను కాపాడాలి



**ప్రజాపక్షం/బోనకల్ :** ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద విలువలను కాపాడుకుంటూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పల్లె ప్రపంచం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన రాజ్యాంగ అధ్యయనంపై ఆయన ప్రసంగించారు. దేశంలో పౌరుల ప్రవర్తన, మనిషి తత్వాన్ని మెరుగుపరిచేందుకు కృషి జరగాలన్నారు. ప్రతి మనిషి తన భావాలకు అతీతంగా, రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా మసులుకోవాల్సిన అవసరం ఉందని కొండలరావు తెలిపారు. మత రాజ్యం స్థాపించడమంటే మనిషిని మౌఢ్యం వైపు నడిపించడమేనని ఆయన తెలిపారు. ప్రకృతిని, ప్రజలను కాపాడేందుకు రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు పెరగకపోతే రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడతాయన్నారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, మండల బాధ్యులు బంధం శ్రీనివాసరావు, సునీత, అప్పారావు, రాంబాబు, హరికిషన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో గంగమ్మ జాతర



**ప్రజాపక్షం/ఖమ్మం :** అంగరంగ వైభవంగా గంగమ్మ తల్లి జాతరను ఆదివారం ముదిరాజ్ కులస్తులు సుమారు 200 మందితో డిజె సౌండ్, మేళ తాళలతో చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండా నృత్యాలు చేసుకుంటూ ప్రకాష్ నగర్ బ్రిడ్జి ప్రాంతంలో ఉన్న గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మత్స్య పారిశ్రామిక సంఘంలో సభ్యత్వాలు రావడంతో 88 మంది మహిళా సభ్యులు నాయకత్వ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు హైమావతి, నాయకులు విజయలక్ష్మి, సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, నర్సింహారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/కారేపల్లి:** రేగులగూడెం గ్రామానికి చెందిన దొడ్డ అప్పారావు, రమాదేవిల పుత్రుడు శివ యాదవ్ వెడ్స్ సూర్య తేజస్వినీ వివాహా వేడుకకు నూతన వధూవరులను రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు అనీఫ్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు దాసరి ఐలయ్య, నాయకులు బోడ రవి, పొక్కిలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా

**-వంగవీటి రంగా విగ్రహావిష్కరణ**
**-జనసంద్రంగా మారిన రామచంద్రాపురం**






**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామంలో సోదా నర్సింహారావు ఏర్పాటు చేసిన స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రంగా వారసుడు వంగవీటి రాధా, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. తొలుత వంగవీటి రాధాకు కల్లూరు నుండి మున్నూరు కాపు సోదరులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి భారీ బైక్ ర్యాలీతో రామచంద్రాపురం తీసుకొని వచ్చారు. రంగా విగ్రహం ఆవిష్కరణ అనంతరం జరిగిన కార్యక్రమంలో వంగవీటి రాధా మాట్లాడుతూ జిల్లాకు సరిహద్దులు ఉంటాయి. రాష్ట్రానికి సరిహద్దులు ఉంటాయి. కాని అభిమానానికి సరిహద్దులేదు అని చాటిచెప్పిన రంగా అభిమానం, రంగా ఒక కులం నాయకుడు కాదు పేద బడుగు బలహీన వర్గాలకు ఒక అండ, అలాంటి నాయకుడు నేటికి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు అంటే ప్రజల కోసం ఎంత చేసి ఉంటాడో ఆలోచించాలని అన్నారు. ఎమ్మెల్యే మట్టా దయానంద్ రాగమయి మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా అంటే బడుగు, బలహీన వర్గాలకు నిజమైన ఆశాజ్యోతి పేదలకు పెన్నిది సమస్యలన్నీ వారి సమస్యల పట్ల పోరాడిన నాయకుడు, ఆయన రాజకీయ రంగంలో ఒక విప్లవం తీసుకొచ్చి మంచి ఎమ్మెల్యేగా పేరు పొంది ఉన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న రాధా మరెన్నో ఉన్నత పదవులు ఆశించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్నూరు కాపు పెద్దలు, పాల్గొన్నారు.

# ప్రతీ పంచాయతీలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

**ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ విజయం సాధించాలి**
**మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ పంచాయతీలలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలం లోని మంగాపురం తండా లో వివిధ పార్టీల నుంచి పలు కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ విజయం సాధించాలని అందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. అభివృద్ధి ని చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీ మండలం తిరుగులేని శక్తి గా నిలిచిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు రాష్ట్రంలోనే పాలేరు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీలో చేరిన వారికి మంత్రి శ్రీనివాసరెడ్డి అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ బాలాజీ, సీత్యా, గోప్రియా, తేజావత్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, చిన్నంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంటపొలాల్లో నీటిని తొలిగించండి

**మంత్రి పొంగులేటికి రాజేశ్వరపురం రైతుల వినతి**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం మండలంలో పర్యటించారు. కోరట్లగూడెం లో ఇళ్ల పై ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలిగించేందుకు కృషి చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డిని ధన్యావాదాలు తెలిపారు. గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం రాజేశ్వరపురం చెరువు ఆయకట్టు కింద వరదకు వరి పంటలు నీట మునిగాయి. వెంటనే నీటిని తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి గ్రామానికి చెందిన రైతులు వినతి పత్రం అందించారు. స్పందించిన మంత్రి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. నేలకొండపల్లి లో జరిగిన మాజీ ఎంపీటీసీ చిలకల సీతారావమ్మరాములు కుమారుడు వివాహం కుహజరైయ్యారు. నూతన వధువరులను ఆశ్వీరదించారు. ఈ సందర్భంగా అక్కడ పలువురు ను ఆప్యాయంగా పలకరించారు. పలువురు వృద్ధులను కలిసి హవ్వా బాగున్నావా అంటూ దగ్గరకు వెళ్లి పలకరించటంతో వారు సంతోషం ను వ్యక్తం చేశారు. ఆరోగ్య, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, గుండ బ్రహ్మం, మార్తి కోటి, కడియాల నరేష్, లక్కంపిడుకొండలు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, కొమ్మినేని విజయబాబు, చిట్టేంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముత్యాలమ్మ బోనాలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** బోనాలు మీకు సమర్పిస్తాం బోగ భాగ్యాలు మాకు ఇవ్వు తల్లీ అంటూ మొక్కులు ఎస్సీ కాలనీ వాసులు మొక్కులను చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం గ్రామ దేవత ముత్యాలమ్మకు బోనాల వేడుకలు నిర్వహించారు. ఇళ్ల నుండి మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామ శివారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు డీజేలు, డప్పు చప్పుళ్ల, ఆటపాటలతో చేరుకున్నారు. దీంతో బోనాల వేడుకలు జాతరను తలపించాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎస్సీ కాలనీలోని ఇళ్లలో బంధుమిత్రులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గద్దల రామకృష్ణ, సుంచు రామ్మూర్తి, భారీ సంఖ్యలో మహిళలు, పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన రేగా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాలే రామకృష్ణ రెడ్డికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఆదివారం మొండికుంటలోని వారి ఇంటికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు రామకృష్ణరెడ్డి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, భద్రాచలం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మానె రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/పాల్వంచ :** కిన్నెరసాని గురుకుల పాఠశాల స్వర్ణోత్సవ సమావేశం ఆదివారం పాల్వంచలోని షాన్బాగ్ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి పూర్వవిద్యార్థులు చక్రవర్తి, ప్రిన్సిపల్ గొగ్గెల రమేష్, శ్యామ్‌కుమార్, రిటైర్డ్ ప్రిన్సిపల్ నూతకాని ఖదీర్ తో పాటు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల్లో జరగబోయే స్వర్ణోత్సవ వేడుకకు 15 రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. 1975లో ప్రారంభమైన విద్యాలయంలో వేలాది మంది చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ఇతర దేశాల్లో స్థిరపడ్డ వారితో పాటు ఈ దేశంలోనే అనేక ప్రాంతాల్లో స్థిరపడిన వారు కార్యక్రమానికి హాజరై జయప్రద చేయాలని , పాఠశాల అభివృద్ధి కోసం అనుభవాలు పాలుపంచుకోవాలని సూచించారు.

# కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటి జిల్లా అధ్యక్షుడిగా లింగస్వామి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటి జిల్లా అధ్యక్షుడు గా తెల్లగొర్ల లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటి సమావేశం లో నూతన కమిటి ని ఎన్నుకున్నారు. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం గ్రామానికి చెందిన లింగస్వామి అధ్యక్షుడు గా, ఉపాధ్యక్షులు గా కొమ్ము రామ, తమ్మిశెట్టి మమత, నంద్యాల వీరభద్రం, కోయ వెంకటనారాయణ, కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు గా వడ్డె జగన్, బీ.బొందయ్య, పి.వెంకటేశ్వర్లు, తేజావత్ శివాజీ, సహాయ కార్యదర్శులు గా షేక్ ప్రకృతి, వాసుదేవ్, తేజావత్ బిక్షం, కార్యవర్గ సభ్యులు గా తేజావత్ బోడి, గోరంట్ల శ్రీను, మేకల వెంకటేశ్వర్లు, కె.వెంకటచారీ, తుమ్మలపల్లి అచ్చయ్య, గౌరవ సలహాదారులు గా కె.అంజయ్య, సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గా చిలకబత్తిని వీరబాబు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన నూతన కమిటిసమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు లక్ష్మణాచారీ, పకీరమ్మ, సీతమ్మ, రామ్లాల్, ఈశ్వరమ్మ, వడ్డె రామారావు, సత్యం పాల్గొన్నారు.